భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ 2







పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## స్పెషల్ బ్రాంచ్ సీఐ బదిలీ




**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి స్పెషల్ బ్రాంచ్ సీఐ తుల శ్రీధర్ బదిలీ అయ్యారు. ఆయనను బాన్సువాడ సీఐగా బదిలీ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బాన్సువాడ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న అశోక్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.



## షేక్‌పేట్ డివిజన్ ఇన్‌ఛార్జీగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగనున్న ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ పలువురు సీనియర్ నాయకులకు ప్రచార బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నాయకత్వంలో షేక్ పేట్ డివిజన్ ఇన్‌ఛార్జీగా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను నియమించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే జాజాల మాట్లాడుతూ.. ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా నా మీద నమ్మకం ఉంచి.. బీఆర్ఎస్ పార్టీ షేక్ పేట ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించిందన్నారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు.



## 14న తెలంగాణ రాష్ట్ర బంద్

**అక్షరటుడే, ఇందూరు:** బీసీ రిజర్వేషన్లపై స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ.. 14న తెలంగాణ రాష్ట్ర బంద్ నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నవాతే ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు నాందేవ్‌వాడలోని బీసీ భవన్‌లో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాలకు, ప్రజా సంఘాలకు, పాఠశాలలు, కళాశాలలను కోరారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించినప్పటికీ కొంతమంది కావాలని పనిగట్టుకొని కేసులు వేసి స్టే తెచ్చారన్నారు. రెడ్డి జాగృతి పేరుమీద బీసీలు అభివృద్ధి చెందొద్దని హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లి రూ.కోట్లు ఖర్చుపెట్టి బీసీల రిజర్వేషన్లను అడ్డుకోవడం సిగ్గుచేటని ప్రతాప్ పేర్కొన్నారు. 14న స్వచ్ఛందంగా ప్రతిఒక్కరూ బంద్‌లో పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రసాద్, శ్రీను శ్రావణ్, కరిపే రాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్త మద్యం దుకాణాల కోసం దరఖాస్తు ప్రక్రియ సాగుతోంది. అయితే ఈ ఏడాది దుకాణాలకు ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. దీంతో ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటికే మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న వారితో పాటు, గతంలో టెండర్లు వేసి షాపులు దక్కించుకోని వారికి ఫోన్లు చేస్తున్నారు. ఈ సారి దరఖాస్తు చేసి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని కోరుతున్నారు. అయినా వ్యాపారుల నుంచి అంతగా స్పందన లేకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ అధికారులు తలపట్టుకుంటున్నారు. ఎక్కువ మొత్తంలో టెండర్లు వచ్చేందుకు తిప్పలు పడుతున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి




# బాబ్బాబూ..

# దరఖాస్తు చేసుకోండి..

■ మద్యం టెండర్లపై వ్యాపారులకు ఎక్సైజ్ అధికారుల ఫోన్లు ■ ఆసక్తి చూపని వ్యాపారులు ■ ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 151 షాపులకు వచ్చింది 255 అప్లికేషన్లే..

ఉమ్మడి జిల్లాలో మద్యం టెండర్ల కోసం నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. గత నెల 26 నుంచి దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 18 వరకు దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉంది. అయితే దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఎవరు ముందుకు రాకపోవడం అధికారులను కలవరానికి గురి చేస్తోంది. మరో ఆరు రోజులు మాత్రమే ఉండడంతో అధికారులు దరఖాస్తుల సంఖ్య పెంచడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురికి ఫోన్లు చేసి మరీ దరఖాస్తు చేసుకోవాలని రిక్వెస్ట్ చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెడుతున్నారు.

### ఫీజు పెరగడంతో..

మద్యం దుకాణాల కోసం టెండర్ వేయడానికి గతంలో ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలు డీడీ చెల్లించాల్సి ఉండేది. ప్రస్తుతం అది రూ.3 లక్షలకు పెరిగింది. ఒకేసారి రూ.లక్ష పెరగడం కూడా దరఖాస్తులు తగ్గడానికి కారణమని తెలుస్తోంది. గతంలో కొంతమంది నాలుగైదు టెండర్లు వేసేవారు. అయితే ఫీజు పెరగడంతో అలాంటి వారు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

### ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు

కామారెడ్డిలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సెప్టెంబర్ 25న వైన్ షాపుల రిజర్వేషన్ కోసం లక్కీ డ్రా నిర్వహించారు. ఎస్సీలకు 5, ఎస్టీలకు 2, గౌడ్‌లకు 7 దుకాణాలు కేటాయించారు. 26 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అయింది. జిల్లాలో మొత్తం 49 షాపులకు ఇప్పటివరకు కేవలం 106 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 షాపులకు 27, దోమకొండ పరిధిలో 8 మద్యం దుకాణాలకు 13, ఎల్లారెడ్డి పరిధిలో 7 షాపులకు 10, బాన్సువాడ పరిధిలో 9 షాపులకు 28, బిచ్కుంద పరిధిలో 10 షాపులకు 28 దరఖాస్తులు వచ్చాయి. గత సంవత్సరం జిల్లాలో 49 మద్యం దుకాణాలకు 2,200 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం దరఖాస్తుల ప్రక్రియలో వేగం పుంజుకోకపోవడంతో అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలోనూ మద్యం దుకాణాల టెండర్లకు ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. జిల్లాలో మొత్తం 102 దుకాణాలకు ఇప్పటివరకు 149 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 36 మద్యం దుకాణాలకు 53 దరఖాస్తులు వచ్చాయి. బోధన్ పరిధిలో 18 దుకాణాలకు 23, ఆర్మూర్ లో 25 షాపులకు 36, భీమ్‌గల్ స్టేషన్ పరిధిలో 12 దుకాణాలకు 22, మోర్తాడ్ పరిధిలో మొత్తం 11 మద్యం షాపులకు కేవలం 15 దరఖాస్తులు అందాయి.

### చివరి నాలుగు రోజుల్లోనే..

ప్రతిసారి మద్యం దుకాణాల కోసం వ్యాపారులు పోటాపోటీగా దరఖాస్తులు చేసేవారు. ప్రస్తుతం దరఖాస్తు రుసుము పెరగడంతో వెనక్కి తగ్గారన్న వాదనను అధికారులు కొట్టిపారేస్తున్నారు. చివరి నాలుగు రోజుల్లో టెండర్ దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. చివరి నిమిషంలో ఎక్కడ దరఖాస్తులు తక్కువగా వచ్చాయో అక్కడ టెండర్ వేయడానికి పలువురు ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీంతోనే ప్రస్తుతం దరఖాస్తులు తక్కువగా వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.



## ప్రాజెక్టుల్లోకి స్వల్ప ఇన్‌ఫ్లో

**అక్షరటుడే, మెండోరా:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్ప ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మొన్నటి వరకు లక్షల క్యూసెక్కుల వరద రాగా.. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో ఇన్‌ఫ్లో పడిపోయింది. జలాశయంలోకి ప్రస్తుతం 6,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే స్థాయిలో అవుట్ ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టంతో నిండుకుండలా ఉంది.

### నిజాంసాగర్‌లోకి..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 10,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు రెండు వరద గేట్ల ద్వారా 9,750 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువకు 1200 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 (17.8 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం అంతే స్థాయిలో నీరుంది.

## పటాకుల దుకాణాదారులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటాకుల దుకాణాదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సంబంధిత డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు. ఎవరైనా అనుమతి లేకుండా దుకాణాలు నెలకొల్పితే వారిపై ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ 1884 , రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారంగా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పటాకుల దుకాణాదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సీపీ సాయిచైతన్య సూచించారు.


### ఈ నిబంధనలు పాటించాల్సిందే..

పటాకుల దుకాణాలను తప్పనిసరిగా ఖాళీ ప్రదేశాల్లోనే నెలకొల్పాలి. ఖాళీ ప్రదేశానికి సంబంధించిన ఎన్‌ఓసీ సర్టిఫికెట్ పొందుపర్చాలి. ఒక క్లస్టర్లో 50 షాపులకు మించి ఏర్పాటు చేయరాదు. జనం రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఎట్టిపరిస్థితుల్లో దుకాణాలు నెలకొల్పరాదు. అదే విధంగా కళ్యాణ మండపాల్లో, సమావేశాలు నిర్వహించే కేంద్రాల్లో పటాకుల దుకాణాలు నెలకొల్పరాదు. తాత్కాలిక పటాకుల దుకాణాల్లో ఫైర్‌కు సంబంధించిన జాగ్రత్తలు తప్పక పాటించాలి.



## నాందేవ్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి

**అక్షరటుడే, ఇందూరు:** సంత్ శిరోమణి సద్గురు నాందేవ్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సూచించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో శిరోమణి సద్గురు నాందేవ్ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాందేవ్ మహరాజ్ 700 ఏళ్ల క్రితమే మేరు కులస్తుల ఐక్యత కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన బోధనలు నేటి తరానికి ప్రేరణనిస్తాయన్నారు. మేరు సమాజం ఆయన ఆలోచనల ప్రకారం ముందుకు సాగి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు హనుమంతరావు, కోశాధికారి చంద్రకాంత్ ప్రధాన కార్యదర్శి దేవదాస్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ నాందేవ్, నగర మేరు సంఘం ప్రతినిధులు దశరథ్ గంగాధర్ సుదర్శన్ పాల్గొన్నారు.





## మాలల హక్కుల సాధనకు కృషి చేస్తా..: మంత్రి వివేక్


**అక్షరటుడే, ఇందూరు:** మాలలకు 12 నుంచి 18 శాతం రిజర్వేషన్ వచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్‌లో ఉన్న ఫంక్షన్ హాల్‌లో వెంకట స్వామి జయంతి, మాలల ఐక్య వేదిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మాలలంతా ఐక్యంగా నిలబడి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. తన తండ్రి జయంతి వేడుకలు జిల్లాలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే అట్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు చేసిన సమయంలో తాను స్టేజీ నుంచి వెళ్లిపోవడం జరిగిందని మంత్రి వివేక్ అన్నారు. తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు. మాలల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. రోస్టర్ విధానం వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కొందరు మాల జాతిని కించపరిచే విధంగా కుట్రలు పన్నుతున్నారని వాటిని తిప్పి కొట్టాలంటే ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాలల వర్గీకరణ కోసం నిరంతరంగా పోరాడుతూనే ఉంటానన్నారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగా 'బోధించు.. సమీకరించు.. పోరాడు' అనే సూక్తి ప్రకారం ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. తాను జిల్లాలో సీపీగా పనిచేసే సమయంలో అందరూ సహకరించారని గుర్తు చేశారు. కానీ రాజకీయాల్లో కులవివక్షత కొనసాగుతుందని దీనిపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రూప్ 1,2 లో ర్యాంకులు సాధించిన అభ్యర్థులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ , వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా మాల మహానాడు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని ఎస్సై మహేష్ అన్నారు. ఎస్పీ రాజేష్ చంద్ర, డీఎస్పీ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు పట్టణంలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాలను పాటించడం, రహదారి భద్రత, ప్రజల రక్షణకు ఆటోడ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. డ్రైవర్లు ఎల్లప్పుడూ తమ వద్ద డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు వెంట ఉంచుకోవాలని సూచించారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోవద్దని.. సౌండ్ బాక్స్‌లు పెట్టకుండా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచనలు చేశారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు వినియోగించవద్దని పేర్కొన్నారు. మద్యం లేదా మత్తు పదార్థాలు వాడి వాహనం నడపవద్దని సూచించారు. అలాగే పోలీస్ తనిఖీల సమయంలో సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై-2 సుబ్రమణ్య చారి, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్ రెడ్డి, కానిస్టేబుళ్లు రాజేశ్వర్, హోం గార్డు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.







శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం గాండ్ల తర్ప–1 ఆధ్వర్యంలో..

# భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

జిల్లాలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. నగరంలోని శివాజీనగర్ మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో ఆయా తర్పలవారీగా మహిళలు బోనాలను ఊరేగించారు. పంటలు బాగా పండాలని.. పిల్లాపాపలు సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నగరంలోని కోటగల్లీలో మాల సంఘం ఆధ్వర్యంలో సైతం బోనాలు తీశారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



పాటిగల్లి , వినాయక నగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో..



శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం దుర్కి తర్ప–2 ఆధ్వర్యంలో..



కోటగల్లి మాల సంఘం ఆధ్వర్యంలో..

## పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** పద్మశాలి కులస్తులంతా ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని కులపెద్దలు అన్నారు. పట్టణంలోని క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం ఆర్మూర్ పద్మశాలి కులస్తుల ఆధ్వర్యంలో అలయ్‌బలయ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మోహన్ దాస్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల రమాకాంత్, సంతోష్, ఆర్మూర్ సర్వసమాజ్ సభ్యుడు ఐడియా సాగర్, బండి అనంతరావు, భాస్కర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ముదిరాజ్ సంఘం గ్రామ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘంలో ముదిరాజ్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్ద కొడప్‌గల్ గ్రామ అధ్యక్షుడిగా రాములు, ఉపాధ్యక్షులుగా బొమ్మల్ నాగులు, కారడి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా మాడు జ్ఞానేశ్వర్, కోశాధికారిగా జక్కల శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ముదిరాజ్ బంధువులంతా పార్టీలకతీతంగా ఐక్యతగా ఉండి మన హక్కుల కోసం పోరాడాలన్నారు. ప్రధానమైన సమస్య అయిన ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌లో కలిపే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మాడు మహేష్, మండల ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాగరాజుకు సన్మానం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును కాంగ్రెస్ నాయకుడు మార ప్రభు సన్మానించారు. నిజామాబాద్ నగరంలో ఆదివారం నిర్వహించిన మాలమహానాడు కార్యక్రమానికి ఎమ్మెల్యే నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మార ప్రభు సన్మానం చేశారు.

## ఆలయాల అభివృద్ధి కమిటీ ఎన్నిక



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని బోర్లం గ్రామంలో ఆదివారం ఆలయాల అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడిగా బసిరెడ్డి ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మన్నె విఠల్, కార్యదర్శిగా కాపర్తి శివరాజులు, కోశాధికారిగా కర్ణం భానుప్రసాద్ ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు బసిరెడ్డి హన్మంత్‌రెడ్డి తెలిపారు. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని ఆలయాల అభివృద్ధి, శుభ్రత, సౌకర్యాల విస్తరణకు, ప్రజల సహకారంతో ఆధ్యాత్మిక చైతన్యానికి కృషి చేస్తామని చెప్పారు.



## సిర్నాపల్లిలో ఘనంగా ఊర పండుగ



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని సిర్నపల్లి గ్రామంలో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పశువులు పాడిపంటలు బాగుండాలని.. ప్రతి ఏడాది ఊర పండుగ నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. పండుగ సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ చావిడి వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోతరాజులు, శివసత్తులు ప్రత్యేక వేషధారణతో చేసిన నృత్యాలు చేశారు. అమ్మవారికి బలిహరణం అనంతరం గ్రామస్థులు బంధుమిత్రులతో కలిసి వనభోజనాలకు వెళ్లారు.



## పాత వర్నిలో కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం

**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలంలోని పాత వర్నిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బీర్కూర్ మొగులయ్య అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కులకర్ణి సురేష్ బాబా మాట్లాడుతూ రాబోయే పంచాయతీ ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పాత వర్ని గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఏకమై పనిచేసి రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని, గ్రామ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని తీర్మానించారు.



## బాలికల వసతి గృహంలో స్వచ్ఛ భారత్

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహం ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, వసతి గృహం వార్డెన్ సుమలత, సిబ్బంది మంగమ్మ, గంగామణి, రూపా, విద్యార్థినులు, సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బోడమీది ప్రశాంత్, వేద రాజ్ కుమార్, మధుసూదన్, చోలా గుర్రం రాకేష్, ఎల్లయ్య, వేణు, కుకింగ్ నరేష్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నగరంలోని విశ్వశాంతి పాఠశాలలో..



## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**అక్షరటుడే, ఇందూరు/ముప్కాల్/ఆర్మూర్:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలుచోట్ల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. నగరంలోని శ్రీ విశ్వశాంతి హైస్కూల్‌లో 2007-08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ముప్కాల్ ఉన్నత పాఠశాల 2003-04 టెన్త్ విద్యార్థులు, ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల 2005-06 పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.



ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో..



ముప్కాల్ ఉన్నత పాఠశాలలో..